సాక్షి
కాకినాడ

బుధవారం । 11 । జూన్ । 2025

క్లుప్తంగా

తాళం వేసి ఉన్న ఇంట్లో.. పట్టపగలే చోరీ

ప్రత్తిపాడు: జాతీయ రహదారి చెంతనే ఉన్న ఓ భవనంలో పట్టపగలే చోరీ జరిగింది. ఇంటికి తాళం వేసి ఉండటం, కాస్త నిర్మానుష్య ప్రాంతం కావడంతో ఆ భవనాన్ని దొంగలు ఎంచుకున్నట్లు తెలుస్తోంది. చోరీకి గురైన ఆస్తి ఎంతన్నదీ తెలియకపోయినప్పటికీ పోలీసులు ప్రాథమికంగా 2.1 కేజీల వెండి, మూడు బంగారు గొలుసులు అపహరణకు గురైనట్లు గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక నరేంద్రగిరి సమీపంలోని కంటిపూడి శివానంద భాస్కరరావు కుటుంబం ఇంటికి తాళం వేసుకుని, గ్రామాంతరం వెళ్లారు. మంగళవారం మధ్యాహ్నం ఆగంతకులు తాళం పగులగొట్టి, ఇంట్లోకి ప్రవేశించి, బీరువాలోని దుస్తులు, ఇతర సామగ్రిని చిందరవందర చేశారు. ఇంట్లోని వెండి, బంగారు నగలు దోచుకుపోయారు. ఆ ఇంటి నుంచి ఆగంతకులు బయటకు వెళ్లడం చూసిన చుట్టుపక్కల వారు ఇంటి యజమానికి ఫోన్ ద్వారా తెలపడంతో పోలీసులకు సమాచారం అందింది. సంఘటన స్థలాన్ని పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజు, ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు పరిశీలించారు. క్లూస్ టీమ్ వివరాలు సేకరిస్తోంది. ఇంటి యజమాని వస్తే చోరీకి గురయిన పూర్తి ఆస్తి వివరాలు వెల్లడవుతాయి. ప్రత్తిపాడు ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా దేవదాయ అధికారిగా నాగేశ్వరరావు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): జిల్లా దేవదాయ శాఖ అధికారిగా కె.నాగేశ్వరరావును నియమించారు. ప్రస్తుతం ఆయన రాజమహేంద్రవరంలో జిల్లా దేవదాయ శాఖాధికారిగా ఉన్నారు. ఇక్కడ ఆ స్థానంలో పని చేస్తున్న ఈవీ సుబ్బారావును రాజమహేంద్రవరం బదిలీ చేశారు. నాగేశ్వరరావు గతంలో కాకినాడలోని దేవదాయ శాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించారు.

జిల్లా వ్యవసాయ అధికారిగా రామారావు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): జిల్లా వ్యవసాయ అధికారిగా వీటీ రామారావు నియమితులయ్యారు. ఇప్పటి వరకూ ఈ స్థానంలో పని చేసిన ఎస్.విజయ్ కుమార్ విజయనగరం జిల్లాకు బదిలీ అయ్యారు. రామారావు గతంలో కాకినాడ జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో డీడీగా పని చేశారు. బదిలీల్లో భాగంగా ఆయన విజయనగరం వెళ్లి, ప్రస్తుతం మళ్లీ కాకినాడ వస్తున్నారు.

పలువురు ఈఓల బదిలీ

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): జిల్లాలోని పలు దేవస్థానాల ఈఓలకు మంగళవారం బదిలీ జరిగింది. కాండ్రకోట నూకాలమ్మ దేవస్థానం ఈఓ ఆర్.సౌజన్యను పిఠాపురం శ్రీపాద శ్రీవల్లభ సంస్థానం ఈఓగా నియమించారు. ఆ ఆలయానికి ప్రస్తుతం ఆమె ఇన్‌చార్జిగా ఉన్నారు. తంటికొండ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఈఓ వద్దాది సత్యనారాయణను పుట్టకొండ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ఈఓగా బదిలీ చేసి, తంటికొండకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. జి.మామిడాడ సూర్యనారాయణమూర్తి దేవస్థానం ఈఓ పాటి సత్యనారాయణను సీతానగరం గ్రూపు దేవస్థానాలకు బదిలీ చేసి, జి.మామిడాడ గ్రూప్‌ను ఇన్‌చార్జిగా అప్పగించారు. ఇంకా పలువురు ఈఓలు కూడా బదిలీ అయ్యారు.

అక్షరంపై కక్ష కట్టి..

'సత్యమేవ జయతే' హితోక్తిని మకుటంలో ధరించి.. ఆ మాటలను త్రికరణ శుద్ధిగా నమ్మి.. ప్రభుత్వ విధానాల్లోని దుర్నీతిని ఎండగడుతూ.. నిరంతరం జనపక్షం వహిస్తూ.. ప్రజలకు నిత్యసత్యాలను అందిస్తున్న 'సాక్షి' అక్షరంపై పాలకులు కక్ష కట్టారు. సాకు కోసం వేచి చూసి.. మూకదాడికి 'కూటమి' కట్టారు. అణగారిన ప్రజల మనస్సాక్షిగా నిలుస్తున్న పత్రిక కార్యాలయంపై తెగబడ్డారు. పత్రిక నేమ్‌బోర్డును బలవంతంగా పెకలించి, ధ్వంసం చేశారు. భయానక వాతావరణాన్ని సృష్టించేందుకు ప్రయత్నించారు. ఆ మూకల బరితెగింపు చూసి అటుగా వెళ్తున్న సామాన్య ప్రజలు నివ్వెరపోయారు. చక్కటి పాలన అందించాలని అందలం ఎక్కిస్తే.. ఇలా అరాచకానికి పాల్పడటమేమిటంటూ నిర్ఘాంతపోయారు.

- నిజాలు చెబుతున్న 'సాక్షి'పై అక్కసు
- దాడికి 'కూటమి' కట్టారు
- రాజానగరంలోని పత్రికా కార్యాలయం వద్ద ఆందోళన
- మూకుమ్మడి దాడి
- అనపర్తి ఎమ్మెల్యే ఆధ్వర్యాన చెలరేగిపోయిన మూకలు
- సాక్షి నేమ్ బోర్డు పీకేసి.. పత్రికల దహనం
- అడ్డుకోబోయిన పోలీసులకు గాయాలు





సాక్షి కార్యాలయం ముందు బైఠాయించిన ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కూటమి శ్రేణులు



కూటమి శ్రేణులు దహనం చేస్తున్న సాక్షి దినపత్రికలు

రాజానగరం: 'సాక్షి' టీవీలో ఇటీవల జరిగిన ఒక చర్చాగోష్ఠిలో అమరావతి మహిళలను కించపరిచేలా ఓ వ్యక్తి వ్యాఖ్యలు చేశారంటూ టీడీపీ శ్రేణుల ఆధ్వర్యంలో ప్రారంభమైన ఆందోళనలు రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతున్నాయి. ఆ పార్టీతో కూటమిగా ఉన్న బీజేపీ, జనసేన శ్రేణులు కూడా ఈ ఆందోళనల్లో పాల్గొని, సాక్షి కార్యాలయాలపై మూకుమ్మడి దాడులకు పాల్పడి, ఆస్తులకు నష్టం కలిగిస్తున్నాయి. ఈ క్రమంలో రాజానగరంలోని సాక్షి ముద్రణా కార్యాలయం వద్ద కూడా కూటమి నేతలు ఆదివారం నుంచి ఆందోళనలు చేస్తున్నారు. మంగళవారం అవి మరింత పరాకాష్టకు చేరాయి. ఆందోళనకారుల దుర్మార్గ చర్యలను నిరోధించేందుకు ప్రయత్నించిన పోలీసులు కూడా గాయపడ్డారంటే వారి చేష్టలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

ఏం జరిగిందంటే..

రాజానగరం, అనపర్తి ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ (జనసేన), నల్లమిల్లి రామకృష్ణారెడ్డి(బీజేపీ)తో పాటు అనపర్తి టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి, జనసేన పార్టీ సమన్వయకర్త రావాడ నాగుల ఆధ్వర్యాన రెండు నియోజకవర్గాల నుంచి ఆ పార్టీల నాయకులు, కార్యకర్తలు సాక్షి ముద్రణా కార్యాలయం వద్దకు భారీగా తరలివచ్చి, ఆందోళనకు దిగారు. ఉదయం 10.30 గంటల సమయంలో రాజానగరం ఎమ్మెల్యే తన అనుయాయులతో కలసి ఆందోళన చేపట్టారు. సాక్షి మీడియాకు, వైఎస్సార్ సీపీకి, పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కొద్దిసేపటికి తన వర్గీయులతో అక్కడకు చేరుకున్న అనపర్తి ఎమ్మెల్యే ఆ ఆందోళనను కొనసాగిస్తూ విధ్వంసం దిశగా నడిపించారు. కార్యాలయం ప్రధాన గేటు ముందు సాక్షి దినపత్రికలను వేసి దహనం చేశారు. పోలీసులు వారించినప్పటికీ ఆందోళనకారులు ఆగలేదు.

దౌర్జన్యం

ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ప్రోత్సాహంతో అనపర్తి నియోజకవర్గానికి చెందిన టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, కొప్పవరం మాజీ సర్పంచ్ కర్రి వెంకట రామారెడ్డి మరింత రెచ్చిపోయారు. పార్టీ శ్రేణులను ఉసిగొల్పారు. దీంతో, అన్నవరం దేవస్థానం మాజీ డైరెక్టర్ సత్తి దేవానందరెడ్డి (బాబు), రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి పుట్ట గంగాధర్ చౌదరి, టీడీపీ మహిళా అధ్యక్షురాలు జుత్తుగ సూర్యకుమారి, ప్రధాన కార్యదర్శి సువాసిని, బిక్కవోలు యూత్ కమిటీ అధ్యక్షుడు పాలచర్ల వెంకట శివ ప్రసాద్ చౌదరితో పాటు కొంతమంది మహిళా కార్యకర్తలు కార్యాలయం ప్రహరీకి అమర్చి ఉన్న సాక్షి నేమ్ బోర్డును బలవంతంగా పెకలించారు. అడ్డుకోబోయిన పోలీసులను ఖాతరు చేయలేదు. ఈ క్రమంలో రాజానగరం సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్, ఎస్సైలు నాగార్జున, నారాయణమ్మతో పాటు కొంతమంది పోలీసుల చేతులకు కూడా గాయాలయ్యాయి.



సాక్షి నేమ్‌బోర్డ్ పెకలిస్తున్న మహిళలు



ధ్వంసమైన సాక్షి నేమ్‌బోర్డ్

రక్షణ కల్పించండి

సాక్షి ముద్రణా కార్యాలయంపై దాడి నేపథ్యంలో బ్రాంచి మేనేజర్ ఎస్.రమేష్‌రెడ్డి, సిబ్బంది కలసి సాయంత్రం సీఐ వీరయ్యగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ దాడి కారణంగా జరిగిన నష్టాన్ని వివరిస్తూనే, ఇవి ఏ స్థాయికి వెళ్తాయోనని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రశాంత పరిస్థితులు నెలకొనేంత వరకూ కార్యాలయం వద్ద అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, తాము విధులు సక్రమంగా నిర్వర్తించేలా రక్షణ కల్పించాలని కోరారు.



రాజానగరం సీఐ వీరయ్యగౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సాక్షి సిబ్బంది

జర్నలిస్టులకు రక్షణ కల్పించాలి

- పత్రికా స్వేచ్ఛను పరిరక్షించాలి
- ఎస్పీకి పాత్రికేయుల వినతి
- సానుకూలంగా స్పందించిన బిందుమాధవ్
- జిల్లావ్యాప్తంగా మీడియా ప్రతినిధుల వినతులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగిస్తున్న కూటమి నేతల తీరుపై జనాగ్రహం పెల్లుబుకుతోంది. రాష్ట్రవ్యాప్తంగా సాక్షి మీడియా ప్రతినిధులు, పాత్రికేయులపై కూటమి సర్కారు దాడులు, కక్ష సాధింపు చర్యలపై జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో ప్రజా, జర్నలిస్టు సంఘాలు మంగళవారం నిరసన తెలిపాయి. జిల్లా కేంద్రం కాకినాడలో పలు జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు జిల్లా ఎస్పీ గరికపాటి బిందుమాధవ్‌కు విజ్ఞాపన అందజేశారు. సాక్షి మీడియాతో పాటు జర్నలిస్టులందరికీ రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వివిధ ప్రాంతాల్లోని జర్నలిస్టులు ఎస్పీని కలిశారు. తమ హక్కులు, విధులకు భంగం కలగకుండా చూడాలని కోరారు. ఎస్పీ బిందుమాధవ్ మాట్లాడుతూ, జర్నలిస్టులకు ఎటువంటి ఇబ్బందీ కలగకుండా, దాడులకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటామని, అది తమ బాధ్యతని భరోసా ఇచ్చారు.

దాడులను ప్రజాస్వామిక వాదులు ఖండించాలి

ఈ సందర్భంగా కాకినాడ సిటీ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రెడ్డిపల్లి రాజేష్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికలు, జర్నలిస్టులపై దాడులకు తెగబడటం, కార్యాలయాలను ధ్వంసం చేయడం వంటి దుశ్చర్యలను ప్రజాస్వామికవాదులందరూ ఖండించాలని కోరారు. జిల్లా జర్నలిస్టుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మంగా వెంకటకృష్ణ మాట్లాడుతూ, ఇటువంటి దాడులకు తెగబడటం సహేతుకం కాదని అన్నారు. సాక్షి మీడియాపై జరుగుతున్న దాడులపై పోలీసులు తక్షణం స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ఎస్పీని కలిసిన వారిలో సీనియర్ జర్నలిస్టు డాక్టర్ సబ్బెళ్ల శివనారాయణరెడ్డి, సాక్షి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్యూరో చీఫ్ లక్కింశెట్టి శ్రీనివాసరావు, సాక్షి టీవీ కరస్పాండెంట్ బొక్కినాల రాజు, మేకల వెంకట రమణ, పాత్రికేయులు కొమ్మిరెడ్డి శ్రీధర్, తోట చక్రధర్, విశ్వనాథుల రాజబాబు, బొత్స వెంకట్, తలాటం సత్యనారాయణ, మురళి, దొమ్మేటి నాగరాజు తదితరులున్నారు.

సాక్షి మీడియాపై జరుగుతున్న దాడులను తక్షణం కట్టడి చేయాలంటూ కాకినాడతో పాటు కాకినాడ రూరల్, పిఠాపురం, ప్రత్తిపాడు, జగ్గంపేట, పెద్దాపురం తదితర ప్రాంతాల్లో జర్నలిస్టులు పోలీసు స్టేషన్లలో ఇన్‌స్పెక్టర్‌లు, సబ్ ఇన్‌స్పెక్టర్లకు విజ్ఞాపనలు అందజేశారు. పిఠాపురంలో జర్నలిస్టులు విజ్ఞాపన పత్రం అందజేసేందుకు వెళ్లగా సీఐ స్థానికంగా లేరు. ఆయన ఆదేశాలతో పిఠాపురం టౌన్ సబ్ ఇన్‌స్పెక్టర్ మణికుమార్‌కు సాక్షి ఆర్‌సీ ఇన్‌చార్జి వీవీవీ ప్రసాద్‌తో పాటు మిగిలిన జర్నలిస్ట్ సంఘాల ప్రతినిధులు విజ్ఞాపన పత్రం అందజేశారు. ఆ సందర్భంగా అక్కడకు వచ్చిన విలేకరులందరి ఆధార్ కార్డులు, ఇంటి అడ్రస్సులు ఇవ్వాలని ఎస్సై మణికుమార్ అడగడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది.

కాకినాడ కార్యాలయం వద్ద బందోబస్తు

సాక్షి కార్యాలయాలపై దాడులపై ఎస్పీ బిందుమాధవ్‌కు వినతి పత్రం ఇచ్చిన వెంటనే పోలీసులు స్పందించారు. ముందస్తు చర్యల్లో భాగంగా కాకినాడ దేవాలయం వీధిలోని సాక్షి ప్రాంతీయ కార్యాలయం వద్ద రాత్రి కాకినాడ వన్‌టౌన్ పోలీసులు బందోబస్తు చేపట్టారు.



సాక్షి మీడియాపై దాడులను ఎస్పీ బిందుమాధవ్‌కు వివరిస్తున్న జర్నలిస్టు ప్రతినిధులు ఎస్ఎస్ఎన్ రెడ్డి, రాజేష్, ఎల్.శ్రీనివాసరావు, బి.రాజు, శ్రీధర్ తదితరులు

మహిళల రక్షణలో ఘోర వైఫల్యం

- కాకినాడలో మహిళల ఆందోళన
- భారీ ర్యాలీ, ధర్నా
- అంబేడ్కర్ విగ్రహానికి విజ్ఞాపన

సాక్షి ప్రతినిధి, కాకినాడ: రాష్ట్రంలో స్త్రీలు, బాలికలకు రక్షణ కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మహిళలు మండిపడ్డారు. మహిళలపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో హత్యాచారాలు, హత్యలు లెక్కకు మిక్కిలిగా జరుగుతున్న కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యాన పెద్ద సంఖ్యలో మహిళలు కాకినాడలో మంగళవారం కదం తొక్కారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు కాకినాడ ఇంద్రపాలెం వద్ద ఉన్న అంబేడ్కర్ సెంటర్‌లో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. నేలపై కూర్చుని నిరసన తెలిపారు. వారిని ఉద్దేశించి మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం కోఆర్డినేటర్ వంగా గీత మాట్లాడుతూ, కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో మహిళలపై ప్రతి రోజూ పదుల సంఖ్యలో దాడులు, హత్యాచారాలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని అన్నారు. ఇంత జరుగుతున్నా పాలకులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా మహిళలకు రక్షణ కరువైందని, చిన్నారులపై హత్యాచారాలు మితిమీరిపోయినా ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని, మహిళలపై దాడులు అరికట్టాలని, రక్షణ కల్పించాలని, ప్రభుత్వం తక్షణం స్పందించాలని, జై జగన్ అని పెద్ద పెట్టున నినదించారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా కమిటీ ఆధ్వర్యాన ప్రదర్శన నిర్వహించిన అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ లక్ష్మీశివకుమారి, పార్టీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి రాగిరెడ్డి చంద్రకళాదీప్తి కుమార్, జిల్లా మహిళా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, పార్టీ సిటీ అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న విద్యాసాగర్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి, సిటీ మహిళా అధ్యక్షురాలు పసుపులేటి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం జంక్షన్‌లో ప్రదర్శన నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ మహిళా నేతలు



అంబేడ్కర్ విగ్రహం వద్ద నేలపై కూర్చుని నిరసన తెలుపుతున్న మహిళలు

సముద్ర స్నానానికి వెళ్లిన యువకుడి మృతి

గల్లంతైన మరొకరి కోసం గాలింపు

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.యానం గ్రామంలో ఉన్న బీచ్‌లో స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగి ఇద్దరు యువకులు గల్లంతుకాగా అందులో ఒకరు మృతిచెందారు. మంగళవారం సాయంత్రం అంబాజీపేట మండలం మాచవరానికి చెందిన యాళ్ళ హరికిషోర్(19), అయినవిల్లి మండలం నేదునూరుకి చెందిన ఇసుకపట్ల జస్వంత్(19), మరో ముగ్గురు నేదునూరుకు చెందిన యువకులు ఎస్.యానం బీచ్‌కు వచ్చి స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. వీరు ఐదుగురు స్నేహితులు. సముద్రంలో స్నానానికి దిగిన ఐదుగురు యువకుల్లో హరికిషోర్, జస్వంత్ సముద్రంలో మునిగిపోయారు. గల్లంతైన యువకుల కోసం గాలింపు చర్యలు చేపట్టగా హరికిషోర్ మృతదేహం లభ్యమయిందని, జస్వంత్ కోసం గాలిస్తున్నట్టు ఎస్ఐ సీహెచ్.రాజేష్ తెలిపారు.



హరికిషోర్ (ఫైల్)

కుటుంబాన్ని ఆదుకుంటాడనుకున్నాం...

అంబాజీపేట: మృతిచెందిన యాళ్ల హరికిషోర్ ఓ ప్రైవేటు కంపెనీలో రికవరీ ఏజెంటుగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతని మృతితో ఆ కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది. కుటుంబాన్ని ఆదుకుంటాడనుకున్న నేపథ్యంలో ఇప్పుడు దిక్కెవరని బంధువులు, కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు చూపరులకు కంటతడి పెట్టించింది. వీరి స్వగ్రామం పి.గన్నవరం కాగా మృతుడి తండ్రి కుమార్ ఎస్.యానం ఓఎన్‌జీసీలో పనిచేస్తున్నారు. తల్లి నాగమణి, అతని సోదరి మాచవరం కుసుమవారిపేటలో అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటున్నారు. అందరితో సరదగా ఉండే హరికిషోర్ ఇక లేడని తెలియడంతో కుసుమవారిపేటలో విషాదచ్ఛాయలు అలుముకున్నాయి. హరికిషోర్ అందరితో కలిసి ఉండేవాడని అతని మరణం జీర్ణించుకోలేకపోతున్నామని కుటుంబ సభ్యులు, బంధువులు రోదిస్తున్న తీరు చూపరులను కలచివేసింది.



ఎస్.యానంలో హరి కిషోర్ మృతదేహాన్ని వెలికి తీసిన ఎస్సై రాజేష్, సిబ్బంది

తప్పిపోయిన బాలుడు

- గంట వ్యవధిలో పట్టుకున్న పోలీసులు
- తల్లిదండ్రులకు అప్పగింత



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్సై రామకృష్ణ

పిఠాపురం: తప్పిపోయిన ఓ బాలుడిని పోలీసులు గంట వ్యవధిలో పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన ఇది. పోలీసుల కథనం ప్రకారం.. గొల్లప్రోలు ఈబీసీ కాలనీకి చెందిన పబ్బిరెడ్డి పాపారావు, కావ్య దంపతులకు మూడేళ్ల కుమారుడు రిత్విక్ శ్రీహన్ ఉన్నాడు. ఆ బాలుడిని తీసుకుని ఆ దంపతులు గొల్లప్రోలు మార్కెట్ సెంటర్‌లోని కావ్య అన్నయ్య ఘట్టెం అప్పలరాజు ఇంటికి మంగళవారం వెళ్లారు. అక్కడ ఆడుకున్న బాలుడు శ్రీహన్ అకస్మాత్తుగా కనిపించకుండా పోయాడు. ఎంత వెతికినా అతడి ఆచూకీ కనిపించకపోవడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు గొల్లప్రోలు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అప్రమత్తమైన గొల్లప్రోలు ఎస్సై ఎన్.రామకృష్ణ తన సిబ్బందితో కలసి గాలింపు చేపట్టారు. బాలుడు శ్రీహన్ గొల్లప్రోలు వద్ద 216 జాతీయ రహదారి పక్కన ఉన్న ఒక హోటల్ వద్ద ఉన్నట్లు గంట వ్యవధిలోనే గుర్తించారు. ఆ బాబును పట్టుకుని, వారి తల్లిదండ్రులకు అప్పగించారు.

సచివాలయం అద్దాలు ధ్వంసం

తుని రూరల్: మండలంలోని తాళ్లూరు గ్రామ సచివాలయం కిటికీల అద్దాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. సోమవారం అర్ధరాత్రి ఈ సంఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఈ సంఘటనపై ఎంపీడీఓ కె.సాయినవీన్, డిప్యూటీ ఎంపీడీఓ జి.మరిడయ్య సూచనల మేరకు సచివాలయ కార్యదర్శి రేష్మా తుని రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సమీపంలో నివాసం ఉంటున్న వారిని విచారించారు. గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థలో భాగంగా రూ.40 లక్షలతో భవనం నిర్మించి, ఫర్నిచర్ ఏర్పాటు చేశారు. దీనిని 2023 జూలైలో అప్పటి ఆర్‌అండ్‌బీ మంత్రి దాడిశెట్టి రాజా ప్రారంభించారు. ఈ భవనంలో మూడు కిటికీల అద్దాలను ధ్వంసం చేసింది ఆకతాయిలా, తాగుబోతులా లేక ఎవరైనా ఉద్దేశపూర్వకంగా చేశారనేది దర్యాప్తులో తేలాల్సి ఉంది. సమీపంలో ఉన్న సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.



దుండగులు ధ్వంసం చేసిన సచివాలయ కిటికీల అద్దాలు

మహిళలను మళ్లీమళ్లీ కించపరుస్తున్నది వాళ్లే..



వంగా గీత

పిఠాపురం: మహిళల విషయంలో జరిగే ప్రచారాల్లో గోప్యత పాటించాలన్న నిబంధనను విస్మరించి పదేపదే ప్రచారం చేస్తున్నది కూటమి నేతలేనని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీతా విశ్వనాథ్ అన్నారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ, అమరావతి విషయంలో టీవీ డిబేట్‌లో జరిగిన విషయం తక్కువ మందికే తెలుసన్నారు. కానీ, దానిపై రాద్ధాంతం చేసి అన్ని చానళ్లలో పదేపదే ప్రచారం చేస్తూ, బహిరంగంగా మాట్లాడుతూ మహిళలను కించపరుస్తున్నది కూటమి నేతలేనని ఆమె మండిపడ్డారు. ఒకసారి అన్న మాటలను పదేపదే అంటున్న కూటమి నేతల పైనే కేసులు పెట్టాలని అన్నారు. మహిళలపై అభ్యంతరకర మాటలు మాట్లాడిన వారి కంటే, వాటిని బహిరంగంగా ప్రచారం చేస్తున్న వారే నేరస్తులవుతారని చట్టాలు చెబుతున్నాయన్నారు. టీవీ లైవ్ డిబేట్లలో అనుకోకుండా తప్పులు దొర్లుతూంటాయని, వాటిని సరిదిద్దుకోవాల్సిన వారు సరి చేసుకున్నా పట్టించుకోకుండా, అన్నవారిపై కాకుండా ఎటువంటి తప్పూ చేయని కేఎస్ఆర్‌పై అక్రమ కేసు పెట్టి వేధించడం సరికాదని గీత అన్నారు. ఇదే విషయంపై పలు పత్రికల్లో కథనాలు వచ్చినట్లు ప్రచారం జరుగుతోందని, వాటిపై కూడా కేసులు పెడతారా అని ప్రశ్నించారు. ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే కూటమి నేతలు దాడులకు దిగుతున్నారన్నారు. సాక్షి టీవీ చానల్‌కు, పత్రికకు సంబంధం లేని అంశాన్ని వాటిపై రుద్ది కావాలనే సాక్షి కార్యాలయాలపై దాడులకు తెగబడుతున్నారని అన్నారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా ఉండే పత్రికా స్వేచ్ఛపై దాడికి దిగడం అమానుషమని పేర్కొన్నారు. ఇటీవల వైఎస్సార్ సీపీ నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమం విజయవంతమైందని, ప్రజల నుంచి ప్రభుత్వంపై పూర్తి వ్యతిరేకత వ్యక్తమవడంతో ఏమీ చేయలేని కూటమి నేతలు పత్రికా కార్యాలయాలపై ఇలా దాడులకు ఎగబడుతున్నారని దుయ్యబట్టారు. కేవలం ఏడాది కాలంలోనే ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చిన ప్రభుత్వం కూటమిదేనని, అందుకే ప్రజలను తప్పుదోవ పట్టించడానికి సాక్షి పత్రిక, చానల్‌పై లేనిపోని రాద్ధాంతం చేసి, అల్లర్లు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ఇటువంటి తప్పుడు చర్యలకు స్వస్తి చెప్పి, ఇచ్చిన హామీలు నెరవేర్చే ప్రయత్నం చేయాలని, లేకపోతే ప్రజలందరూ కూటమి నేతలను రోడ్డుకీడ్చే రోజులు దగ్గరలోనే ఉన్నాయని గీత అన్నారు.